దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, డిసెంబర్ 10 : తెలంగాణ ఓవర్సీస్ పవర్‌కం లిమిటెడ్(టామ్‌కామ్)లో తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కార్మాగార శాఖల ఆధ్వర్యంలో దుబాయ్‌లో బైక్ రైడర్స్, సెక్యూరిటీ గార్డుల్లో ఉద్యోగాలకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 13న టామ్‌కామ్ ద్వారా దుబాయ్‌లో ఉద్యోగాలకు ఎన్‌రోల్‌మెంట్స్ ఉంటాయని ఆయన వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నూతన రెజ్యూమ్‌ను tomcom.resume @gmail.comకి పంపాలన్నారు. వివరాలకు www.tomcom.telangana.gov.inని, 94400 50951, 94400 49861, 9440051452 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చౌరస్తా సుందరీకరణలో మార్పులు చేయాలి

వేములవాడ, డిసెంబర్ 10: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ కోసం రూపొందించిన డిజైన్‌ను మార్చడంతోపాటు, అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పలువురు నాయకులు అంబేద్కర్ చౌరస్తాను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, గోలి మహేశ్, దుమ్మ ఆనంద్, సంటి అంజిబాబు, గుండా థామస్, మూలే కిషోర్, బొడ్డు రాములు, జక్కుల యాదగిరి, జింక శ్రీధర్, సిరిగిరి శ్రీకాంత్, పిట్టల సతీశ్, లింగంపల్లి కిరణ్, గుడిసె మనోజ్ కుమార్, వంకాయల మహేశ్వర్, తాళ్లపల్లి నాగరాజ్, బొజ్జ చంద్రమోహన్, చర్ల రమేశ్, బాలు, వేణుగోపాల్, అరుణ్, అమర్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు

కోనరావుపేట, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. ఇటీవల గురుకులల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై హాస్టళ్లను సందర్శించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజనం పథకం నిర్వహించాలని కోరారు. ఇక్కడ మండల నాయకులు జశ్వంత్, ఈశ్వర్, చేతన్, విష్ణు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి

- అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నడు
- నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు
- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

సిరిసిల్ల టౌన్: విలేకరులతో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 10: ఆంధ్రులు తెలంగాణను ధ్వంసం చేశారని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, వారితో కలిసి తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పని చేసిన ద్రోహి అతడేనని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఉద్ఘాటించారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి, జై తెలంగాణ అని నినదించనోడు నేడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపంలో మార్పులు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సిరిసిల్లలోని కొత్తబస్టాండ్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొండూరు రవీందర్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి నాయకులతో కలిసి పంచామృతాభిషేకం చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంలో ఎన్నికల హామీలు ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు విచిత్రమైన పనులు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి రూపం మార్చినంత మాత్రాన తెలంగాణ అస్థిత్వం మారబోదన్నారు. సెక్రటేరియేట్ ఎదుట రేవంత్‌రెడ్డి పెడుతున్న విగ్రహంతో ప్రజలకు సంబంధంలేదన్నారు. గ్రామగ్రామాన ప్రతిష్ఠించిన విగ్రహాలను మాత్రమే ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చినంత సులభం కాదని, ఎన్నికల హామీలు అమలుచేయకపోతే ప్రజల చేతుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తెలంగాణ చిహ్నాన్ని మార్చేందుకు యత్నించడం, వాహన నంబర్ సిరీస్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చడం, తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడానికి ప్రజలు నీకు అధికారం ఇవ్వలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తన ఆలోచన విధానం మార్చుకుని తెలంగాణ అభివృద్ధి గురించి పనిచేయాలని సూచించారు. నాలుగేండ్ల కాలంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి చేతిలో ఉండే బతుకమ్మను తొలగించి, కాంగ్రెస్ పార్టీ గుర్తును ప్రతిబింబించేలా చేతిని మార్చడం సరైందికాదన్నారు. నాలుగేండ్ల తరువాత రాబోయే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మ్యాన రవి, సత్తార్, గుండ్లపల్లి పూర్ణచందర్, అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్, రాపెల్లి అరుణ, దిడ్డి మాదవి, దార్నం అరుణ, సయ్యద్ అక్రం, పోచవేని ఎల్లయ్య, రాజిరెడ్డి, సుంకపాక మనోజ్, తుమ్మ రాజు, శంకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న యూత్ నేతలు

గంభీరావుపేట, డిసెంబర్ 10: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ యూత్ నేతలు పాలాభిషేకం చేశారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి వారు పూల మాలలు వేశారు. అనంతరం విగ్రహాలకు పాలాభిషేకం చేసి జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్, నేతలు గోగు లింగంయాదవ్, రెడ్డిమల్ల రాజనర్సు, పెద్దవేని వెంకటియాదవ్, చిట్టంపల్లి భిక్షపతి, దోసల శంకర్, ఇరిగి సందీప్, ఎగదండి రవి, అర్జున్, వెంకటి, దోసల రాజు, శ్రీధర్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట : నారాయణపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి ఆధ్వర్యంలో నారాయణపూర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. తెలంగాణ అస్థిత్వ చిహ్నాలను మార్చేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు ఎలుసాని మోహన్, అందె సుభాష్, మజీద్, నిమ్మల బాబు, నర్సింహారెడ్డి, నమిలికొండ శ్రీనివాస్, విక్రమ్, సింగా రం దేవరాజు, లద్దునూరి తిరుపతి తదితరులున్నారు.

రూ.10 వేల వేతనం అందించాలి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబర్ 10 : కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు తమకు రూ.10 వేల వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో రాంరెడ్డికి పలు డిమాండ్లతో వినతిపత్రం అందించారు. శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ అనే స్వచ్ఛంద సంస్థకు కట్టబెట్టాలని చూస్తున్నారని, ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, కార్మికులు బీరెడ్డి లక్ష్మీనర్సవ్వ, రాజవ్వ, సరోజన, విజయ, రేణుక, రాజేశ్వరి, రోజా, సునీత, మల్లవ్వ, ఎల్లవ్వ, సుజాత, జుబేదా, అనిత, లక్ష్మి, సరోజన పాల్గొన్నారు.

బాలికలకు పెండ్లి చేస్తే జైలుకే

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాధిక జైస్వాల్

వీర్నపల్లి, డిసెంబర్ 10: 18 ఏండ్లు నిండని బాలికలకు పెండ్లిచేస్తే తల్లిదండ్రులను జైలుకి పంపిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉచిత న్యాయ సహాయం, గృహ హింస చట్టం, మెయింటనెన్స్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, న్యాయ సేవా సంస్థ సేవలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వంటశాలను పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. ఇక్కడ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పరశురాములు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు వేణు, తిరుపతి, ఎస్ఐ ఎల్లాగౌడ్, ప్రిన్సిపాల్, ఎస్వో, ఉపాధ్యాయులున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీఅవిర్నేని సంతోష్ కుమార్, S/o నర్సింగరావు, R/o. చందుర్తి గ్రామం, మరియు మండలం రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఇల్లునెం.1-30/12/9/1,(PART) కు చెందిన, ఖాళీస్థలం విస్తీర్ణం: 300.00 చ.గజాలు, చందుర్తి గ్రామం మరియు మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ అక్షేపనలు కానీ వ్యాజ్యములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 10-12-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

కలెక్టరేట్, డిసెంబర్ 10 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష(ఎస్ఎస్) ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని అందులో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పేస్కేల్‌పై ఇచ్చిన హామీని అమలు చేయాలని పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి మాట్లాడారు. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల డిమాండ్‌లను రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరవధిక సమ్మె దీక్షలు చేపట్టామన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షలు జీవిత, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి చేసిన వారికి బెనిఫిట్స్ రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ నియామకాలలో వెయిటేజ్ కల్పించాలని, పీటీఐలకు 12 నెలల వేతనం అందించాలని డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మెలో ఇప్పపూల దేవయ్య, కత్తి జయలక్ష్మి, రాజు, తుమ్మ రాజేందర్, భవాని, నీరజ, సలీం, నరేందర్, శ్రీనివాస్, రవి, నరేశ్, నగేశ్, దేవరాజు, చందన్, శ్రీలత, లావణ్య, పద్మ, జ్యోతి ఉన్నారు.

కాంగ్రెస్ మాటల ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, డిసెంబర్ 10 : కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదని, కేవలం మాటల ప్రభుత్వమని ఈ ఏడాది పాలనలో రుజువు చేసుకుందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన గడిచినా ఇప్పటి వరకు పాత పనులను చేయడమే తప్పా ఒక్క కొత్తపనికి పూనుకోలేదన్నారు. సిద్దిపేట నుంచి మండల కేంద్రానికి నాలుగు వరుసల రోడ్డు మంజూరి అయిందని, జిల్లెల్ల నుంచి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు మంజూరీ అయిందని ఇప్పటివరకు వాటికి టెండర్ చేసి పనులను ప్రారంభించలేదన్నారు. మండల కేంద్రంలోని 50 పడకల దవాఖాన మంజూరై నిధులు సిద్ధంగా ఉన్నా నేటి వరకు వాటి పనులను ప్రారభించలేక పోయిందన్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఇప్పటివరకు ప్రారంభించలేకపోయిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతి రెడ్డి, మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, పరశురాం, మాజీ సర్పంచ్ కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు కేవీఎన్ రెడ్డి, ఉడుతల వెంకన్న, సత్తిరెడ్డి, రఘు, సలీం, సాదుల్, మధు, తదితరులున్నారు.

విద్యార్థుల సమయానికి బస్సులు నడపాలి

- ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

మేనేజర్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు మల్లారపు ప్రశాంత్, కుర్ర రాకేశ్

కలెక్టరేట్/ముస్తాబాద్, డిసెంబర్ 10 : జిల్లాలో విద్యా సంస్థల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. ఈ మేరకు మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ ప్రకాశ్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, ముస్తాబాద్ మండలం నామాపూర్ మోడల్ స్కూల్‌కు సాయంత్రం సమయంలో బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతుందన్నారు. వీర్నపల్లి మండలానికి సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా చేరుకుంటున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బస్సులు పాఠశాలల సమయానికి అనుగుణంగా నడపాలని కోరారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

డీఈకి ఎస్ఈగా పదోన్నతి

ముకరంపుర, డిసెంబర్ 10: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)కరీంనగర్ సర్కిల్ డీఈ(టెక్నికల్)కి ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల సెస్‌లో డిప్యుటేషన్‌పై ఏడాది పాటు పనిచేయాలని పోస్టింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహిళను వేధించిన కేసులో యువకుడి అరెస్ట్

ముస్తాబాద్, డిసెంబర్ 10 : మహిళను ప్రేమించమని, పెళ్లి చేసుకోవాలని వేధించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుండెల్లి అజయ్ కుమార్ ఓ మహిళ వెంటపడుతూ ప్రేమించమని పెళ్లి చేసుకోవాలని వేధించాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ గణేశ్ తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

రుద్రంగి, డిసెంబర్ 10: మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతిని రుద్రంగి మున్నూరుకాపు చైతన్య యూత్ సంఘం సభ్యులు మంగళవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు చైతన్య యూత్ సంఘం సభ్యులతోపాటు తదితరులున్నారు.

ఇద్దరి అరెస్ట్

చందుర్తి, డిసెంబర్10: అక్రమంగా ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జాగిరి నర్సయ్య ఇల్లును అతనికి తెలియకుండానే అన్న అయిన జాగిరి పరశురాములు, కూతురు జాగిరి మానస, నేరెళ్ల రమేశ్ కలిసి మానస పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు కాగా జాగిరి పరశురాములు, జాగిరి మానసను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించగా, నేరెళ్ల రమేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా గీతా జయంత్యుత్సవాలు

నాగిరెడ్డి మండపంలో భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డి మండపంలో హవనం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 3 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించే గీతా జయంత్యుత్సవాలను మంగళవారం మొదటిరోజు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అనుబంధ ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు గీతా హోమం నిర్వహించారు. సంస్కృత పాఠశాల, కళాశాల, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పఠించారు. ఆలయ ఉపప్రధానార్చకులు ప్రతాప శ్రీనివాస్ శ్రీమద్భాగవతం దశమస్కంద పురాణప్రవచనం గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్, చంద్రగిరి శరత్, అర్చకులు గోపన్నగారి గణేశ్, మామిడిపెల్లి శరత్, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల మల్లారెడ్డి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పోస్టులు పెడితే సహించేదిలేదు

- బీఆర్‌ఎస్‌వై పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వై పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 10: బీఆర్‌ఎస్ నేతలపై వ్యక్తిగత పోస్టులు పెడితే చూస్తూ ఊరుకోబోమని బీఆర్‌ఎస్‌వై పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు అన్నల్‌దాస్ భాను ఇటీవల సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత పోస్టులు పెట్టి బీఆర్‌ఎస్ నేతలను కించపరిచే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పై ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఒకే రోజులో తన పేరు అందరికీ తెలియాలన్న ఉత్సాహంతో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. గతంలో ఎన్నడూ సిరిసిల్ల రాజకీయ వ్యవస్థలో వ్యక్తిగత విమర్శలు చేసుకోలేదన్నారు. కాంగ్రెస్ నేత భాను ఇంట్లో సమస్య వచ్చినప్పుడు కుటుంబ సమస్యను రాజకీయం చేయొద్దని చెప్పిన గొప్ప వ్యక్తి చక్రపాణి అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులపై ఎటువంటి వ్యక్తిగత పోస్టులు పెట్టలేదని గుర్తుంచుకోవాలన్నారు. మరోసారి ఇటువంటి పోస్టులు పెడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీఆర్‌ఎస్‌వై నేత కత్తెర వరుణ్ మాట్లాడుతూ, సిరిసిల్ల రాజకీయ వ్యవస్థలో ఎన్నడూ లేని విధంగా కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపుతుందని అన్నారు. ఇప్పటికైనా అన్ని అధికార పార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే సరైన గుణపాఠం చెబుతామన్నారు. పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధిపై సిరిసిల్ల గాంధీ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశంలో మునీర్, మెట్ట రాజు, షాదాబ్, సాయి, వేముల గంగాధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడ, డిసెంబర్ 10: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు మంగళవారం వైద్య పరీక్ష నిర్వహించారు. రక్తహీనత విటమిన్ లోపం లాంటి పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్ శరత్ కుమార్, వైద్యులు లహరిక, పావని, ఫార్మసిస్టులు గౌస్, సౌజన్య, అధ్యాపకులు అంజయ్య తదితరులున్నారు.

విద్యా సామగ్రి అందించడం అభినందనీయం

తెలంగాణ చౌక్, డిసెంబర్ 10: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని హెచ్‌ఎం భాగ్యరేఖ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన వ్యాపారవేత్త కొండం విష్ణు క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి దాతలు ముందుకురావాలని ఆకాంక్షించారు. ఇక్కడ శ్రీనివాస్‌రావు, కీర్తి, కరుణశ్రీ గంగారం, శ్రీనివాస్ తదితరులున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 10: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో సీఎం కప్ పోటీల్లో భాగంగా మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్ స్వరూపరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ లావణ్య తదితరులున్నారు.

వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ

కలెక్టరేట్, డిసెంబర్ 10: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవసాయ గణన 2021-22 ఫేజ్-2,3పై శిక్షణ కార్యక్రమాలు మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ముఖ్య ప్రణాళికాధికారి పీబీ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యవసాయాధికారులు, సెన్సెస్ ఛార్జ్ ఆఫీసర్లుగా, ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసిన 50 గ్రామాల్లో వ్యవహరిస్తారన్నారు. శిక్షణలో ముఖ్య ప్రణాళికాధికారి పీబీ శ్రీనివాసచారి మాట్లాడుతూ, గణనను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, వ్యవసాయాధికారులు, ఉపగణాంక అధికారులు, ఎంపీఎస్‌వోలు, వ్యవసాయ విస్తరణాధికారులున్నారు.

రాజన్న సేవల వివరాల నూతన బోర్డుల ఏర్పాటు



రాజన్న ఆలయంలో స్వామివారి సేవల వివరాలు తెలుపుతూ నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డు

వేములవాడ, డిసెంబర్ 10: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులకు స్వామివారి నిత్య సేవలు, ప్రత్యేక దర్శనాల వివరాలను తెలుపుతూ నూతన బోర్డులను మంగళవారం అధికారులు ఏర్పాటు చేశారు. నవంబర్ 26న 'కోట్ల ఆదాయం ఉన్నా సమాచార బోర్డులు కరువు' అనే కథనాన్ని నమస్తే తెలంగాణ ప్రచురించగా స్పందించిన ఆలయ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజన్న ఆలయ కోడెల క్యూ కాంప్లెక్స్, ఈవో కార్యాలయం ముందు, విచారణ కార్యాలయం, భీమేశ్వర సదన్, నందీశ్వర వసతి సముదాయాల్లోనూ ఈ బోర్డులు ఏర్పాటు చేశారు.

'విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

వీర్నపల్లి, డిసెంబర్ 10: విద్యుత్ సరఫరాలో సేవా లోపాలు పరిష్కరించడమే లక్ష్యమని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గంభీరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల సెస్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. విద్యుత్ మీటర్, బిల్లులు, డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సత్వరమే పరిష్కరిస్తామని చైర్మన్ పేర్కొన్నారు. ఇక్కడ సీజీఆర్‌ఎఫ్ మెంబర్ టెక్నికల్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, సెస్ ఎండీ శ్రీనివాస్, ఏఈ రమేశ్, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, తదితరులున్నారు.

'ఉపాధి హామీ'పై సమగ్ర పరిశీలన



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

ఇల్లంతకుంట, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై సమగ్ర పరిశీలన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో శేషాద్రి మాట్లాడుతూ, మండలంలోని 33 పంచాయతీలకు చెందిన ఉపాధి హామీ పథకం సద్వినియోగంపై అధికారులు సమగ్ర పరిశీలన నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల సద్వివినియోగంపై అధికారికంగా చేపట్టిన రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఏపీవో చంద్రయ్య, కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.